క్లుప్తంగా

పాఠశాలపై చర్యలు తీసుకోండి



ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

రాయచోటి అర్బన్ : ప్రభుత్వ నిబంధనలు పాటించని చిట్వేలు మండల కేంద్రంలోని సాయివికాస్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రశాంత్ డిమాండ్ చేశారు. సదరు పాఠశాల అవినీతి, అక్రమాలపై విచారణ జరపాలంటూ గురువారం డీఈఓ ఛాంబర్ ఎదుట ధర్నా జరిపారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ అనుమతులు లేకపోయినప్పటికీ హాస్టల్‌ను నడుపుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉన్న వ్యక్తి పాఠశాలను స్థాపించి నిర్వహిస్తూ ప్రభుత్వ ఉపాధ్యాయులతోనే చదువు చెప్పిస్తున్నప్పటికీ విద్యాశాఖ ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సదరు పాఠశాలపై చర్యలు తీసుకోవాలంటూ డీఈఓ కార్యాలయ ఏడీకి వినతిపత్రం సమర్పించారు.

ఘనంగా గంగమ్మ జాతర



గంగమ్మను దర్శించుకుంటున్న నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని జంగిటివారి పల్లిలో గురువారం గ్రామస్తులు వైభవంగా గంగమ్మ జాతర నిర్వహించారు. గ్రామంలోని ప్రజలు గంగమ్మకు భక్తిశ్రద్ధలతో మొక్కుబడులు తీర్చుకొన్నారు. గంగమ్మకు పూలతో ప్రత్యేక అలంకరణ చేశారు. అలాగే గంగమ్మను దర్శించుకోవడానికి పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, రాష్ట్ర టూరిజం డైరెక్టర్ మందల నాగేంద్ర, పట్టణ కన్వీనర్ సీహెచ్ రమేష్ తదితరులు వచ్చారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆటో యూనియన్ నాయకుడు ఉదయ్‌కుమార్ పుట్టినరోజు పురస్కరించుకొని ఆటో డ్రైవర్లు గురువారం 300 మంది పేదలకు అన్నదానం నిర్వహించారు. అలాగే రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బత్తిన గంగయ్య, ఘని, ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

నివాళి

ఓబులవారిపల్లె : మండల పరిధిలోని వైకోట గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న శరత్ బాబు అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి శరత్ బాబు మృతదేహానికి నివాళులర్పించారు. అందరికీ సహాయపడుతూ వైద్య సేవలు అందించే శరత్ బాబు మృతి చెందడం బాధాకరమని వైకోట సర్పంచ్ మల్లెం ఈశ్వరయ్య ఆవేదన వ్యక్తం చేశారు. నివాళి అర్పించిన వారిలో ఎంపీటీసీ దుర్గాప్రసాద్, దేశయ్య, సుకుమార్ తదితరులు ఉన్నారు.

సాయిబాబాకు పూజలు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం పురస్కరించుకొని అర్చకులు బందాత్మకూరు సతీష్ శర్మ ఆధ్వర్యంలో భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం భక్తులు ఆలయానికి వచ్చి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. రాత్రి స్వామి వారికి ఉంజల్, పల్లకీ సేవలు నిర్వహించారు.

17న కవి సమ్మేళనం

కడప కల్చరల్ : నగరంలో ఈనెల 17న ఉర్దూ కవి సమ్మేళనం నిర్వహించనున్నారు. బజ్మే జావీద్ ఉర్దూ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 7 గంటలకు నగరంలోని కోటగడ్డవీధిలోగల షాహిర్ మంజిల్‌లో ఈ కవి సమ్మేళనం నిర్వహిస్తామని సంస్థ అధ్యక్షులు ప్రొఫెసర్ సత్తార్ సాహిర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి రాయచోటి ఉర్దూ డిగ్రీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సయ్యద్ హైదర్ అలీ అధ్యక్షత వహిస్తారని, ప్రముఖ ఉర్దూ కథా రచయిత మహమూద్ షాహిద్ ముఖ్య అతిథిగా, ఇంతియాజ్ అహ్మద్ సాఖిబ్ పాల్గొంటారన్నారు.

పారదర్శకంగా బదిలీలు చేపట్టాలి

కడప రూరల్ : వైద్య ఆరోగ్యశాఖ జోన్–4 పరిధిలో చేపట్టే సాధారణ బదిలీలను పారదర్శకంగా చేపట్టాలని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి డి.రవికుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆ శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం వారు మాట్లాడుతూ జోన్–4 పరిధిలో చేపట్టే ఉద్యోగుల సాధారణ బదిలీలను నిబంధనల మేరకు చేపట్టి ఉద్యోగులకు మేలు చేకూరేలా చూడాలని కోరారు.

పోటీతత్వాన్ని పెంచేందుకే ప్రోత్సాహకాలు

- నియోజకవర్గ టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు సత్కారం
- జగన్ హయాంలో విద్యారంగంలో సమూల మార్పులు
- ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి



విద్యార్థినికి నగదు ప్రోత్సహకాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

రాజంపేట టౌన్ : విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యం కాగలదని విశ్వసించిన ఏకైక నాయకుడు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి తెలిపారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో గురువారం నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో మండల టాపర్లుగా నిలిచిన టెన్త్, ఇంటర్ విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు అవార్డుల అందజేత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి టాపర్లకు ప్రభుత్వం మంజూరు చేసిన నగదు ప్రోత్సాహం, మెడల్, ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. జగన్ సీఎం అయ్యాక విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొచ్చారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులంతా నిరుపేదలైనందున వారి విద్యపై ప్రత్యేక దృష్టిసారించారన్నారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల విద్యార్థులకు ఏమాత్రం తీసిపోని విధంగా అత్యుత్తమ మార్కులు సాధిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు సీఎం జగనన్న ఆణిముత్యాలు పేరిట నగదు ప్రోత్సాహకాన్ని అందజేయడం విద్యార్థుల్లో పోటీతత్వాన్ని మరింత పెంచుతుందన్నారు. ఈ కారణంగా వచ్చే ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాల శాతం గణనీయంగా పెరుగుతుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదిలావుంటే రాజంపేట మండల టాపర్‌గా నిలిచిన సౌజన్య ఇంగ్లిష్‌లో మాట్లాడి తాను మండల టాపర్‌గా నిలిచేందుకు దోహదపడ్డ అంశాలను వివరించింది. దీంతో ఎమ్మెల్యే ఆ విద్యార్థినిని ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలన్నా, ఉద్యోగ అవకాశాలను సులువుగా అందిపుచ్చుకోవాలన్నా ఆంగ్లభాష అవశ్యకత ఎంతైనా ఉందని సీఎం గుర్తించారన్నారు.

అందువల్లే ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్లభాషను తప్పనిసరి చేశారని, ఈ కారణంగా నిరుపేదింటి బిడ్డలు ఇంగ్లిష్‌లో మాట్లాడగలుగుతున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గంలో ప్రతి మండలంలో ముగ్గురు టాపర్‌లకు నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ గంగిరెడ్డి, హెచ్‌ఎం భారతి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామిరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు ఆకేపాటి అనీల్‌కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కొండూరు శరత్‌కుమార్‌రాజు, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యోగీశ్వరరెడ్డి, ఎంపీటీసీ మధుబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మహిళా ఇన్‌చార్జ్ మిర్యాల సురేఖ, వివిధ విభాగాల కన్వీనర్లు రాజ, విశ్వనాథరాజు, దాసరి పెంచలయ్య పాల్గొన్నారు.

ఆస్తి పన్ను చెల్లించిన ఆర్టీసీ

రాజంపేట : రాజంపేట మున్సిపాలిటీకి ఆర్టీసీ రాజంపేట డిపో ఆస్తి పన్నును గురువారం చెల్లించారు. డిపో మేనేజరు రమణయ్య మున్సిపాలిటీ ఆర్‌ఐ హరిని కలిసి చెక్కును అందజేశారు. మొదటి అర్ధ సంవత్సరం ఆస్తి పన్ను కింద రూ.50,337ను మున్సిపాలిటీకి చెల్లించాల్సి ఉంది. కాగా పన్నును ఆర్టీసీ రాజంపేట డిపో డీఎం ముందుస్తుగా కట్టారు. కార్యక్రమంలో డిపో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ ఎం.రమణయ్య పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : అంగన్వాడీ వర్కర్లు, ఆయాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ అనుబంధమైన ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాళ్లు డిమాండ్ చేశారు. గురువారం యూనియన్ నాయకులతో కలిసి వర్కర్లు, ఆయాలు కడప నగరంలోని కడప అర్బన్ ఐసీడీఎస్ కార్యాలయం ఎదురుగా ఆందోళన నిర్వహించారు.

ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : అక్రమాలకు పాల్పడే ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు చెప్పలి పుల్లయ్య పేర్కొన్నారు. గురువారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు కార్మికులకు సక్రమంగా వేతనాలు ఇవ్వకుండా ఈఎస్‌ఐ, పీఎఫ్ చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. ప్రైవేట్ మాల్స్, ఆసుపత్రులు, పాఠశాలలో సెక్యూరిటీ సిబ్బందిగా పని చేస్తున్న కార్మికుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు.

బ్రహ్మోత్సవాలకు పటిష్ట బందోబస్తు



డీఎస్పీ చైతన్యను సన్మానిస్తున్న ఎంపీపీ మేడా

రాజంపేట : ఈనెల 27 నుంచి జరిగే నందలూరు సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలకు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తామని రాజంపేట డీఎస్పీ చైతన్య వెల్లడించారు. గురువారం నందలూరు మండలాధ్యక్షుడు మేడా విజయభాస్కర్‌రెడ్డి బ్రహ్మోత్సవాల నిర్వహణ నేపథ్యంలో డీఎస్పీని కలిసి భద్రత పరమైన సాయం అందించే విషయంపై చర్చించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో అవసరమైన రీతిలో సమీక్షించుకొని బందోబస్తును కల్పిస్తామన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా శాఖపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 17న జరిగే బ్రహ్మోత్సవాల నిర్వహణ సమన్వయ సమావేశం నిర్వహించనున్నట్లు, సమావేశానికి పోలీసుశాఖ తరఫున హాజరు కావాలని డీఎస్పీని కోరామన్నారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు శాఖ పరంగా సహకారం అందిస్తామని డీఎస్పీ హామీ ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు జిల్లా కార్యదర్శి సయ్యద్ అమీర్, మండల కో–ఆప్షన్ సభ్యుడు కలీం, వైఎస్సార్‌సీపీ నాయకుడు యల్లంరాచపల్లె సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకముందుగా డీఎస్పీని ఎంపీపీ శాలువా కప్పి, బోకేను అందజేసి సత్కరించారు.

మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

కడప కార్పొరేషన్ : మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్. రవి, కె.తిరుపాల్ డిమాండ్ చేశారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చనిపోయిన కార్మికుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని, అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. పర్మినెంట్ కార్మికులకు సీపీఎస్ రద్దు చేయాలన్నారు.

క్లాప్ డ్రైవర్లకు రూ.18500 జీతం వర్తింపజేయాలని, ఈఎస్‌ఐ, పీఎఫ్ వర్తింపజేయాలన్నారు. కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే జూలై ఒకటో తేది నుంచి నిరవధిక సమ్మె చేపడుతామని హెచ్చరించారు. యూనియన్ నాయకులు ప్రకాస్, శ్రీదర్ బాబు, కిరణ్ కుమార్, బ్రహ్మానందరెడ్డి, మస్తాన్, బాలాజీ, అసిబాబు, శివ, ప్రసన్న, మస్తానమ్మ, లక్ష్మిదేవి, పెంచలమ్మ, కొండమ్మ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి 'జగనన్నకు చెబుదాం'



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి సురేష్ కుమార్

ఒంటిమిట్ట : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫోన్ చేసి చెప్పేందుకు ×జగనన్నకు చెబుదాం౯ అనే కార్యక్రమం నిర్వహిస్తున్నారని మండల ప్రత్యేక అధికారి సురేష్ కుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని రాచగుడిపల్లి గ్రామ సచివాయలంలో ఎంపీడీఓ రెడ్డయ్య ఆధ్వర్యంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా హాజరైన సురేష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాచగుడిపల్లి గ్రామ పంచాయతీలోని సమస్యల గురించి స్థానిక అధికారులను, ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా ప్రజా సమస్యలపై వినతులు కూడా వచ్చాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మాధవీలత, మండల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు సత్కారం



సత్కరించి, నగదును అందిస్తున్న దృశ్యం

నందలూరు(రాజంపేట) : టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచిన నందలూరు జెడ్పీ హైస్కూలుకు చెందిన పేద దళిత విద్యార్థిని సంధ్య, పాటూరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన సాయికీర్తనకు నగదు ప్రోత్సాహకాన్ని గురువారం స్థానిక నందలూరు జెడ్పీ హైస్కూల్‌లో శ్రీరాం ప్రజావైద్యశాల అధినేత డా.అరిగె రాంప్రసాద్, రిటైర్డ్ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డా.కె.వాణిలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి యేడాది టెన్త్‌లో ఉత్తమ ప్రతిభను చాటుకున్న ఇద్దరికి రూ.20వేలు నగదును ఇవ్వాలని నిర్ణయించామన్నారు. డా.అరిగె పెద్దసుబ్బరాయుడు జ్ఞాపకార్థంగా పేదింటి ఆణిముత్యాల విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలనే ముందుకొచ్చామన్నారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ శ్రీనివాసులు, జేవీవీ జిల్లా అధ్యక్షుడు రౌఫ్ బాషా, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి గురించి జాగ్రత్తగా మాట్లాడాలి

కడప కల్చరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురించి మాట్లాడే సమయంలో తగిన జాగ్రత్త వహించాలని గ్రేటర్ రాయలసీమ బలిజ సంఘం అధ్యక్షులు చెన్నంశెట్టి మురళీకృష్ణ తెలిపారు. ఇటీవల కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, బీజేపీ అధ్యక్షులు నడ్డా రాష్ట్రానికి వచ్చినపుడు పని గట్టుకుని ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్‌ను చదివినట్లుగా పసలేని విమర్శలు గుప్పించారని, ఇక్కడి ప్రతిపక్షాలు కూడా ఆ విమర్శలను చూసి నవ్వుకుంటున్నాయని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి అమలు చేయనన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక యువ ముఖ్యమంత్రిగా సంపూర్ణంగా ప్రజల కోసమే ప్రభుత్వం అన్న రీతిలో పాలిస్తున్నారన్నారు. పలువురు కేంద్ర మంత్రులు సైతం ప్రశంసించిన విషయం వారికి కూడా తెలుసన్నారు. కానీ రాష్ట్రంలోని కొన్ని రాజకీయ శక్తులను సంతోష పరిచేందుకు వారు అలా రాసిచ్చిన స్క్రిప్ట్‌ను చదివారన్నారు. నిజానికి వారికి కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన గురించి బాగా తెలుసని, వారు మనస్ఫూర్తిగా ఈ విమర్శలు చేసినట్లుగా కనిపించడం లేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ బలిజ సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యా హక్కు చట్టంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న చెన్న కృష్ణయ్య

లక్కిరెడ్డిపల్లె : విద్యా హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల లీగల్ ఆథారిటీ కమిటీ చైర్మన్ వీరవల్లి చెన్న కృష్ణయ్య పేర్కొన్నారు. మండల లీగల్ చైర్మన్ ఆదేశాల మేరకు గురువారం స్థానిక మూడురోడ్ల కూడలిలో విద్యా హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం 1982లో విద్యా హక్కు చట్టం ఏర్పాటు చేసి ప్రతి పేద పిల్లవాడిని ప్రభుత్వ వసతి గృహాలలో చేర్పించి విద్యను అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, దీనికి తోడు ప్రైవేటు విద్యాసంస్థలలోనూ పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించాలని చట్టం చెబుతోందన్నారు. బాల కార్మికుల వ్యవస్థను రూపుమాపాలని, విద్యా హక్కు చట్టంలో కొత్త మలుపులు ప్రభుత్వం తీసుకొచ్చిందని ఆయన తెలియజేశారు. పిల్లలు పనికి వెళ్లకుండా బడికి వెళ్లాలని, విద్యా హక్కు చట్టం పేర్కొందన్నారు.

డిపో లాభాల బాటలో పయనించాలి

మదనపల్లె సిటీ: ఆర్టీసీ డిపో లాభాల బాటలో పయనించేలా సమిష్టి కృషి చేయాలని ఆర్టీసీ టు డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. గురువారం స్థానిక టు డిపో కార్యాలయంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ సమ్మర్ స్పెషల్ పేరుతో నడిపిన బస్సులకు మంచి ఆదరణ వచ్చిందన్నారు. డ్రైవర్, కండక్టర్ నుంచి సిబ్బంది కలిసి పని చేయడంతో ఆదాయం పెరిగిందన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. సూపరింటెండెంట్ ఎం.వి.రమణ, ఈపీకేఎల్ కండక్టర్లు, డ్రైవర్లు కె.ఆర్.కృష్ణ, ముస్తఫా, టీ.ఎస్.రాజా, రెడ్డప్ప, టిఎం రత్నం, కెఎంపిఎల్‌లో ఆర్‌ఎల్ రెడ్డి, ఎం.వి.రమణ, మార్కెటింగ్ విభాగంలో జీవి.రమణ తదితరులు పాల్గొన్నారు.

పీలేరులో..

పీలేరు రూరల్ : ఇంధనం పొదుపు ఆదాయానికి మలుపులాంటిదని డీఎం బి. కుమార్ అన్నారు. గురువారం స్థానిక ఆర్టీసీ గ్యారేజీలో ఇంధనం పొదుపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మే నెలలో ఇంధనం పొదుపులో పీలేరు డిపో ద్వితీయ స్థానం సాధించిందని అన్నారు.

పాఠశాల.. ఉపాధ్యాయులు లేక వెలవెల

- ఉపాధ్యాయులను నియమించాలంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు
- హైస్కూల్ మంజూరు చేయాలని కోరుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



మండల కేంద్రంలోని ఉర్దూ పాఠశాల

చిట్వేలి : మండల కేంద్రంలో 60 సంవత్సరాలుగా కొనసాగుతున్న ఉర్దూ పాఠశాలకు ఉపాధ్యాయులు నియామకం జరుగక వెలవెలబోతోంది. ఉపాధ్యాయులను నియమించాల్సిన నిర్లక్ష్యం కారణంగా పాఠశాల మూతపడే స్థితికి చేరిందని పలువురు స్థానికులు, ముస్లింలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పాఠశాలలో 40 మంది విద్యార్థులు చదువుతుండేవారని, ఉర్దూ బోధించే ఉపాధ్యాయులు లేక ప్రస్తుతం 20 మంది మిగిలారని తెలిపారు. గతంలో ఇక్కడ చదివిన విద్యార్థినులు హైస్కూల్ చదువు కోసం రాజంపేట హైస్కూల్‌కు వెళ్తున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఉర్దూ పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించాలని ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు దృష్టికి తీసుకుపోయినప్పటికీ వారు ఇచ్చిన హామీలు ఆచరణలో అమలు కాలేదని ఆరోపిస్తున్నారు. గత మూడు సంవత్సరాల క్రితం ఈ పాఠశాలలో ఇద్దరు ఉర్దు బోధించే ఉపాధ్యాయులు ఉండేవారని, అప్పట్లో వీరు బదిలీపై వెళ్లగా తిరిగి ఇక్కడ ఉర్దూ ఉపాధ్యాయులను నియమించకపోవడం ఎంతవరకు సమంజసమన్నారు. ఈ విషయమై స్థానిక ముస్లింలు చిట్వేలి హెల్ప్ లైన్ సొసైటీ సభ్యులు ఎంఈఓ మహేశ్వరరావుకు గత సోమవారం వినతిపత్రం అందజేశారు. ఇక్కడ ప్రాథమిక పాఠశాలలో తెలుగు మీడియం బోధించే ఉపాధ్యాయుడు ఉర్దూ పాఠశాలకు వచ్చి హాజరు తీసుకోవడం జరుగుతున్నదని తెలిపారు. ఉన్నతాధికారులు తక్షణం స్పందించి ఉర్దూ బోధించి ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని ముస్లింలు విజ్ఞప్తి చేశారు.

ఎంఈఓ వివరణ

ఈ విషయమై మండల విద్యాశాఖ అధికారి మహేశ్వరరావును వివరణ కోరగా ఉర్దూ పాఠశాలకు ఉపాధ్యాయుల్ని నియమించాలని గత సోమవారం స్థానిక ముస్లింలు వినతిపత్రం అందజేశారని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించి ఉపాధ్యాయులను నియమించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు.

ఉపాధ్యాయుల్ని నియమించాలి



60 సంవత్సరాలుగా కొనసాగుతున్న ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోవడంతో పాఠశాల కనుమరుగయ్యే స్థితికి చేరింది. తక్షణం ఉర్దూ బోధించే ఉపాధ్యాయులను నియమించాలి.

– ఇంతియాజ్ అహ్మద్, చిట్వేలి

దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది



ఉర్దూ హైస్కూల్ లేకపోవడంతో విద్యార్థినులు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. దీంతో అటు విద్యార్థులకు, ఇటు తల్లిదండ్రులకు కష్టంగా ఉంది. ఉపాధ్యాయులను నియమించడంతోపాటు ఉర్దూ హైస్కూల్‌ను ఏర్పాటు చేయాలి.

– షేక్ సాధిక అలీ, చిట్వేలి

జగనన్న విద్యా కానుక విద్యార్థులకు వరం

సంబేపల్లె : జగనన్న విద్యా కానుకను విద్యార్థులకు వరం అని మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని నాగిరెడ్డిగారిపల్లెలో జగనన్న విద్యాకానుకను విద్యార్థులకు గురువారం పంపిణీ చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాల విద్యార్థులకు ఏ మాత్రం తీసిపోని విధంగా ప్రభుత్వ విద్యార్థులు సైతం చదువులో ప్రతిభచూపే విధంగా జగనన్న విద్యా కానుక తోడ్పడుతుందన్నారు. విద్యాకానుక కింద ప్రతి విద్యార్థికి ఉచితంగా 3 జతలు యూనిఫాం, ఒక జత బూట్లు, స్కూల్‌బ్యాగ్, బెల్ట్, బూట్లు, సాక్సులు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలని తెలియజేశారు. ఉన్నత ఆశయాలను నిర్దేశించుకొని వాటి సాధనకు కృషి చేయాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు



స్కూటర్ల సైలెన్సర్లు తొలగించిన పోలీసులు



యువకులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

రాయచోటి టౌన్ : అధిక శబ్దాలతో ద్విచక్రవాహనాలను నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని రాయచోటి ట్రాఫిక్ ఎస్‌ఐ మహమ్మద్ రఫీ ద్విచక్రవాహనాల యజమానులను హెచ్చరించారు. గురువారం అన్నమయ్య జిల్లా ఎస్పీ గంగాధర్ రావు ఆదేశాల మేరకు డీఎస్పీ మహబూబ్ బాషా, అర్బన్ సీఐ సుధాకర్ రెడ్డిల సూచనలతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఠానా, బంగ్లా వంటి ప్రధాన సర్కిళ్లలో పలు ద్విచక్రవాహనాలను ఆపి వాటికి అదనంగా ఎక్కువ శబ్దం వచ్చే విధంగా (మాడిఫైయింగ్ సైలెన్సర్లు) తొలిగించారు. అలాగే 50 వాహనాల (రాయల్ ఎన్‌ఫీల్డ్) లకు సైలెన్సర్లు తొలిగించి వాటికి జరిమానా విధించారు. ఇకపై ఇలాంటి అధిక శబ్దాలతో కూడిన సైలెన్సర్లు అమర్చుకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అధిక శబ్దాలతో వచ్చే అనర్థాలను తెలియజేసే విధంగా ప్రధాన కూడళ్లలో బోర్డులు ఏర్పాటు చేశారు. అనంతరం ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు.

ఘనంగా ఎమ్మెల్యే గడికోట పుట్టినరోజు వేడుకలు



సంబేపల్లె: రక్తదానం చేస్తున్న మాజీ డీసీఎంఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి



రాయచోటి: రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న బేపారి మహ్మద్ ఖాన్

రాయచోటి : అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు నియోజకవర్గ వ్యాప్తంగా పండుగ వాతావరణంలో జరిగాయి. నియోజకవర్గ పరిధిలో పలు సేవా కార్యక్రమాలను అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు చేపట్టారు. గురువారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మదనపల్లె నియోజకవర్గ పరిశీలకుడు హబీబుల్లా ఖాన్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు బేపారి మహ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాలలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహ్మాన్, ఏపీఎంఐడీసీ స్టేట్ డైరెక్టర్ ఆర్.శ్రీనివాసులు రెడ్డి, జెడ్పీటీసీ వెంకటేశ్వరరెడ్డి, పలువురు కౌన్సిలర్లు, కో–ఆప్షన్ మెంబర్లు, పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు – ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

భగవంతుని దయతో నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఆకాంక్షించారు. తన పుట్టినరోజు సందర్భంగా హైదరాబాదు సమీపంలోని చిలుకూరు బాలాజీని కుటుంబ సమేతంగా శ్రీకాంత్ రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జన్మదిన ఆర్భాట వేడుకలకు దూరంగా ఉండాలన్నదే తమ అభిమతమన్నారు. శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ పేరుపేరున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆయన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

సంబేపల్లె/లక్కిరెడ్డిపల్లె/ గాలివీడు: సంబేపల్లెలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమం చేపట్టారు. విష్ణువర్ధన్‌రెడ్డితోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో రక్తదానం చేశారు. జెడ్పీటీసీ కవిత ఆధ్వర్యంలో కేకును కట్ చేశారు. పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు. లక్కిరెడ్డిపల్లెలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రెడ్డయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గడికోట జన్మదిన వేడుకలను నిర్వహించారు. భారీ కేకను కట్‌చేసి పంచిపెట్టారు. గాలివీడు మండలంలో ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.